రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

టెక్కలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): త్వరలో కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా సీనియర్ మెన్, ఉమెన్ జట్లను ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపిక చేశారు. రెండు విభాగాల్లోనూ 12మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డొంకాన రామకృష్ణ, పొన్నాడ పార్వతీశం తెలిపారు. క్రీడాకారులకు ప్రయాణ ఖర్చులు, క్రీడాదుస్తులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు, ఎం.జనార్దనరావు, రామిరెడ్డి, రాజా, రఘునాథ్, సత్యనారాయణ, శ్యామల రావు, మోతీలాల్, నారి, సీతయ్య, నర్మద పాల్గొన్నారు.



ఇది ఇచ్ఛాపురం పట్టణంలోని రత్తకన్న రైల్వే ఎల్‌సీ గేటు వద్ద పరిస్థితి. ఇక్కడ గేటు పడిందా.. అంతే సంగతులు. గంటల తరబడి ఇరువైపులా వాహనాలు నిలిచిపోతాయి. ఇక్కడ ఫ్లైఓవర్ (వంతెన) నిర్మించాలని దశాబ్దాలుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నా ఫలితం శూన్యం. ఎట్టకేలకు అది సాకారం కానుంది. ఇక్కడ వంతెన నిర్మించేందుకు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. ఇలాంటి వంతెనలు ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలో 12 చోట్ల నిర్మించనున్నారు.

రైల్వే వంతెనలకు గ్రీన్‌సిగ్నల్

- గేట్ల స్థానంలో 12 ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఈస్టుకోస్టు ఉత్తర్వులు
- ప్రజలకు తీరనున్న రవాణా కష్టాలు

ఇచ్ఛాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి):

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలో 12 చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. రైల్వే గేట్ల స్థానంలో వీటిని నిర్మించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి హైవేల ఆధునికీకరణలో భాగంగా రైల్వే లైన్లు ఉన్న ప్రతిచోటా ఫ్లైఓవర్లు నిర్మించారు. పట్టణాలకు ఉన్న రోడ్లలో మాత్రం రైల్వేగేట్లు ఉండిపోయాయి. దీంతో ప్రజలు ప్రయాణాల సమయంలో నరకయాతన పడుతున్నారు. ఇప్పుడు ఫ్లైఓవర్లు మంజూరు కావడంతో రవాణా కష్టాలు తీరనున్నాయి.

ఎక్కడెక్కడంటే..

ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు సమీపంలో రైల్వేక్రాసింగ్ నంబర్ 326, 329, 330, 334 వద్ద వంతెనలు రానున్నాయి. అంటే ఒక్క ఇచ్ఛాపురం పట్టణంతో పాటు రూరల్ పరిధిలో నాలుగు రహదారులకు ఫ్లైఓవర్లు రానున్నాయన్న మాట. జాడుపూడి రైల్వేస్టేషన్ పరిధిలో 341 లెవల్ క్రాసింగ్ వద్ద, సోంపేట రైల్వేస్టేషన్ పరిధిలో 343 క్రాసింగ్ వద్ద వంతెనలు నిర్మించనున్నారు. సోంపేట-బారువ రైల్వేస్టేషన్ల మధ్య 345, 348, 351 లెవల్ క్రాసింగ్‌ల వద్ద, బారువ నుంచి మందస రైల్వేస్టేషన్ల మధ్య 353, 354, 358 లెవల్ క్రాసింగ్‌ల వద్ద వంతెనలు నిర్మించనున్నట్టు ఈస్టుకోస్టు రైల్వేశాఖ ముఖ్య ఇంజనీర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గేటుపడితే నరకమే..

జిల్లాలో ఎక్కడా లేని విధంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ప్రజలు రైల్వేగేట్లతో నరకయాతన పడుతున్నారు. ఎటు వెళ్లాలన్నా ప్రతి రోడ్డులో రైల్వే గేట్లు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పలాస-కాశీబుగ్గ పట్టణ ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే కాశీబుగ్గ సమీపంలోని ఎల్‌సీ గేటును దాటాల్సి ఉంటుంది. వజ్రపుకొత్తూరు వెళ్లాలంటే తాళ్లభద్ర ఎల్‌సీ గేటు దాటాలి. ఈ రెండు గేట్లు పలాస రైల్వేస్టేషన్‌కు అటు ఇటుగా ఉంటాయి. దీంతో రైలు ఆగినా.. నిలిచినా.. గేటు అలానే మూసి వేసి ఉంటుంది. మందస మండల ప్రజలకు కొర్రాయిగేటు, బాలిగాం, కొత్తపల్లి గేట్లు నరకయాతన చూపిస్తుంటాయి. సోంపేట మండలంలో పాలవలస, కొర్లాం గేట్ల వద్ద నిత్యం అదే పరిస్థితి. కంచిలి మండలానికి సంబంధించి బూరగాం, అంపురం, గొల్ల కంచిలి రైల్వేగేట్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పురుషోత్తపురం, రత్తకన్న, జగన్నాథపురం రైల్వేగేట్లతో ఇచ్ఛాపురం పట్టణ ప్రజలు పాట్లు పడుతున్నారు. ఎట్టకేలకు 12 చోట్ల వంతెనల నిర్మాణం జరగనుండడంతో ప్రజలకు కష్టాలు తప్పనున్నాయి. వీలైనంత త్వరగా పనులు చేపట్టాలని రెండు నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారు.

శుభ పరిణామం



రైల్వే గేట్లతో నరకయాతన పడుతున్నాం. ఇచ్ఛాపురం పట్టణానికి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. దశాబ్దాలుగా వంతెన నిర్మాణం అనేది కల. ఎట్టకేలకు రైల్వేశాఖ వంతెన నిర్మాణానికి ముందుకు రావడం శుభ పరిణామం. వీలైనంత త్వరగా పనులు చేపట్టాలి. ప్రజలకు రవాణా కష్టాలు తీర్చాలి.

-సుగ్గు ప్రేమ్, ఇచ్ఛాపురం

కష్టాలు తీరుతాయి



ఇటీవల విశాఖ రైల్వేజోన్‌లో ఈ ప్రాంతాన్ని కలపకుండా అన్యాయం చేశారు. అయితే ఇప్పుడు ఈస్టుకోస్టు రైల్వేజోన్ అధికారులు 12 చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించేందుకు ముందుకు రావడం శుభ పరిణామం. దీంతో ప్రజలకు రోడ్డు రవాణా కష్టాలు తీరుతాయి. శరవేగంగా పనులు పూర్తిచేయాలి.

-కట్టా సూర్యప్రకాష్, డీఆర్‌యూసీసీ సభ్యుడు, ఇచ్ఛాపురం



మంత్రి అచ్చెన్నాయుడుకి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఈవో భద్రాజీ

రూ.100కోట్లతో ఆదిత్యాలయ అభివృద్ధి

- మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి/శ్రీకాకుళంరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా రూ.100కోట్లు మంజూరు చేయించి, అరసవల్లి ఆదిత్యాలయాన్ని దేశంలోనే ఒక గొప్ప పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కుటుంబ సమేతంగా సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి చిత్రపటాన్ని ఈవో భద్రాజీ అందజేశారు. అనంతరం మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'నా తల్లి మరణంతో సంవత్సరం పాటు స్వామిని దర్శించుకోలేకపోయాను. ఇప్పుడు దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. రాష్ట్ర పండగగా ప్రకటించడంతో ఈ ఏడాది రథసప్తమి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించాం. ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించి.. కొంతమేర చేపట్టాం. కలెక్టర్, ఎమ్మెల్యే శంకర్, ఇతర అధికారులతో తక్షణమే మాట్లాడి మిగిలిన పనులను పూర్తిచేస్తాం. స్నానాల గదులు, మరుగుదొడ్లను నిర్మించడంతో పాటు భక్తులకు ఎండ నుంచి రక్షణ కోసం తగిన ఏర్పాట్లు వెంటనే చేయాల్సి ఉంది. భక్తులు సంతృప్తి చెందేలా అభివృద్ధి పనులు చేపడతామ'ని తెలిపారు. అనంతరం ఆయన నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామిని, పెద్దపాడులోని అప్పన్నమ్మ తల్లిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

కచ్చితమైన గణాంకాలేవీ?

- జిల్లాలో ఏఎస్‌వో పోస్టులు సగానికిపైగా ఖాళీ
- 30 మండలాలకుగానూ ఉన్నది 14 మందే
- పీ-4 సర్వేలో వారే కీలకం
- ఔట్‌సోర్సింగ్ విధానంలోనైనా భర్తీ చేయాలని డిమాండ్



శ్రీకాకుళం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047లో భాగంగా పీ4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) ద్వారా ఆంధ్రాను పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ధృఢ సంకల్పంతో ఉంది. ఇప్పటికే రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా పీ4 సర్వే చేస్తోంది. ప్రణాళిక శాఖకు చెందిన ఉప గణాంకాధికారులు, సహాయ గణాంకాధికారులు క్షేత్రస్థాయిలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ప్రస్తుతం ఐదుగురు ఉద్యోగులను సచివాలయాల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకుని నియోజకవర్గ విజన్ ప్లాన్‌లు తయారీకి సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గ, జిల్లాస్థాయిలో పర్యవేక్షణ కోసం కమిటీలు కూడా వేశారు. కాగా.. మండల స్థాయిలో డేటా క్రోడీకరించేది ఒకే ఒక ఉద్యోగి 'సహాయ గణాంకాధికారి (ఏఎస్‌వో)' మాత్రమే. వీరు అందించే సమాచారం చాలా కీలకం. కాగా ఇటువంటి కీలక పోస్టులు రాష్ట్రంలో సుమారు 285 ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో ముప్పై మండలాలకు కేవలం 14 మంది ఏఎస్‌వోలు మాత్రమే పనిచేస్తున్నారు. అంటే సగం మంది కూడా లేకపోవడంతో పనిభారం పెరుగుతోందని, కచ్చితమైన గణాంకాలు లభించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

అదనపు పనిభారం

తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఏఎస్‌వో.. జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి ఆదేశాలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వహించాలి. రెవెన్యూ వర్షమాపిని ద్వారా సంగ్రహించిన వర్షపాతం వివరాలను ప్రతిరోజు ఉదయం 8.30గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో స్థూల ఉత్పత్తిని లెక్కించేందుకు ప్రైమరీ సెక్టార్ (వ్యవసాయం), ఇండస్ట్రీయల్ సెక్టార్, సర్వీస్ సెక్టార్‌ల నుంచి డేటాని సేకరించడం వీరి ముఖ్య విధి. వీటితోపాటు జనాభాగణన, కేంద్ర సంస్థ ఎన్ఎస్ఎస్‌వో(జాతీయ శాంపిల్ సర్వే ఆఫీస్)కి అనుబంధంగా రాష్ట్రంలో సామాజిక ఆర్థిక గణన, పారిశ్రామిక సర్వేలు చేయాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల జీవనప్రమాణాలపై, సంక్షేమ పథకాల లబ్ధిదారుల అభిప్రాయాలపైనా సర్వేలు చేస్తారు. పంటల బీమాకు సంబంధించి పంటకోత ప్రయోగాలు మండల వ్యవసాయ అధికారితో కలిసి పర్యవేక్షిస్తారు. అవకతవకలకు వీలులేకుండా పంటకోత ప్రయోగాలు, దిగుబడి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారు. కాగా ఈ పోస్టులు.. ఏళ్ల తరబడి ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. ప్రతి ఏఎస్‌వోకీ అదనపు మండలాల బాధ్యతలు ఉండటం వల్ల పనిభారంతో కచ్చితమైన గణాంకాలు సకాలంలో ప్రభుత్వానికి అందజేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. కచ్చితమైన గణాంకాలు లేకపోవడం వల్ల ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా నిజమైన పేదవారికి అవి అందక ఎప్పటికీ పేదరికం తగ్గదు. గ్రామస్థాయిలో కచ్చితమైన గణాంకాల సమాచారాన్ని విశ్లేషణ చేసి.. ప్రణాళికలు తయారుచేస్తే కొన్నేళ్లలో పేదరికాన్ని 80 శాతం తగ్గించేందుకు అవకాశముంటుంది. తద్వారా ప్రభుత్వ లక్ష్యం.. ఆశయం నెరవేరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- ఇదిలా ఉండగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైనా గ్రూప్ 2 అధికారి హోదాలో చేరినా తమకు పదోన్నతి కల్పించడం లేదని ఏఎస్‌వోలు ఆవేదన చెందుతున్నారు. అదనపు పనిభారంతో అవస్థలు పడుతున్నామని, ఖాళీ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనైనా భర్తీ చేయాలని కోరుతున్నారు. సచివాలయంలో మిగులు ఉద్యోగులను ఏఎస్‌వోలకు సహాయకులుగా నియమించి గ్రామస్థాయిలో ప్రణాళిక శాఖను పటిష్ఠం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తేలనున్న తమ్మినేని 'డిగ్రీ' బాగోతం

- ఇప్పటికే పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఫిర్యాదు
- విచారణ చేపట్టాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ప్రభుత్వ ఆదేశం

7లో

పేదల గూడుకు ప్రభుత్వ సాయం

- అసంపూర్తి ఇళ్లకు అదనపు నిధులు
- జిల్లాలో 7414 మందికి లబ్ధి

8లో

సిక్కోలు ఉద్యమాలకు దిక్సూచి 'అప్పలసూరి'

- సినీనటుడు నారాయణమూర్తి

8లో

కొబ్బరిపై తెగుళ్ల పంజా

- తెల్లదోమ, నల్లముట్టి దాడితో దెబ్బతింటున్న చెట్లు
- మొక్కదశలోనే ఆశిస్తున్న కాండం తొలుచు పురుగు
- రైతులకు తప్పని నష్టాలు
- నివారణ చర్యల కోసం అధికారులకు విన్నపం



మఖరాంపురంలో నల్లముట్టి ప్రభావంతో ఎండిన కొబ్బరిచెట్లు



కవిటిలో తెల్లదోమ ప్రభావంతో కొబ్బరికమ్మలు ఇలా..

కవిటి, మార్చి 23(ఆంధ్రజ్యోతి):

ఉద్దానం.. కొబ్బరి పంటకు ప్రసిద్ధి. నాణ్యమైన కాయలు దిగుబడికి పెట్టింది పేరు. అలాంటి కొబ్బరిపై ఇప్పుడు తెగుళ్లు పంజా విసురుతున్నాయి. వాటి దాడితో అధిక చెట్లు నాశనమవుతున్నాయి. పచ్చని కొమ్మలు ఎండిపోతున్నాయి. ఫలితంగా దిగుబడి తగ్గి రైతులకు నష్టాలను మిగులుస్తోంది. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో 32వేల ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి తోటలు ఉన్నాయి. అయితే వరుస తుఫాన్ల కారణంగా కొబ్బరి ఏదో ఒక తెగులు బారిన పడుతోంది. 1999లో ఏర్పడిన తుఫాన్ అనంతరం ఎర్రనల్లి సోకి కాయపరిమాణం, నాణ్యతను దిగజార్చింది. తరువాత రైతులు కొంతమేర కోలుకుంటుండగా 2018లో తితలీ తుఫాన్ తాకిడితో వారి బతుకు చిన్నాభిన్నమైంది. వేల చెట్లు నేలకొరిగాయి. మిగిలి ఉన్న చెట్లు ప్రస్తుతం ఆశిస్తున్న తెగుళ్లతో దెబ్బతింటున్నాయి.

తెల్లదోమ..

కవిటి, కంచిలి మండలాల్లో కొబ్బరి పంటను తెల్లదోమ నాశనం చేస్తోంది. ఉదయం పూట తోటల్లోకి వెళితే తెల్లదోమ విజృంభణ అధికంగా ఉంటుంది. పచ్చని కొబ్బరికమ్మలకు దిగువ భాగంలో గూడు కట్టుకొని ఉంటున్నాయి. అడుగు భాగంలో తెల్లని నూలుపోగు లాంటి జిగురు పదార్థాన్ని విసర్జిస్తున్నాయి. దీనిపై నల్లని శిలీంధ్రం సోకడంతో కొమ్మల్లో పచ్చదనాన్ని పీల్చేస్తున్నాయి. దీంతో కొన్ని రోజులకు కొమ్మలు ఎండిపోతున్నాయి. కొబ్బరితో పాటు ఆకుకూరల పంటలు, మర్రి, రావిచెట్లకు సైతం తెల్లదోమ సోకినట్లు రైతులు చెబుతున్నారు. జిల్లాలో మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా తెల్లదోమ ఆశించిందని, ఎండల తీవ్రతతో దాని ఉధృతి మరింతగా పెరుగుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గూగోసి దోమగా పిలిచే దీనిని 2016లో కేరళ రాష్ట్రంలో తొలుత కనుగొన్నట్లు తెలిపారు. ఆ తర్వాత తమిళనాడు, మన రాష్ట్రంలోని కోనసీమ ప్రాంతంలో వాటి ప్రభావం కనిపించిందని, ప్రస్తుతం కవిటి, కంచిలి మండలాల్లో ఎక్కువగా ఉందని చెబుతున్నారు.

నల్లముట్టి..

నల్లముట్టి తెగులు కొబ్బరి చెట్లలో పచ్చదనాన్ని హరిస్తుంటుంది. చెట్ల కొమ్మలు ఎండిపోయి (మిగతా 8వ పేజీలో..)

ఎప్పుడు చెల్లిస్తారో?

- 'పల్లె పండుగ' బిల్లుల కోసం ఎదురుచూపు
- పనులు పూర్తయినా డబ్బులు చెల్లించని ప్రభుత్వం
- ఆందోళనలో కాంట్రాక్టర్లు, పాడిరైతులు

నరసన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, గోకులాల షెడ్లను నిర్మించింది. పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో టీడీపీ నేతలు, కాంట్రాక్టర్లు లక్షల రూపాయిలు పెట్టుబడులు పెట్టి శరవేగంగా నిర్మాణాలు చేపట్టారు. అయితే, పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించలేదు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. అధికారులు దగ్గరుండి నాణ్యతతో పనులు చేయించారని, ఇప్పుడు బిల్లులు చెల్లించకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.84కోట్లతో 148 పనులు..

నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, సారవకోట, జలుమూరు, పోలాకి మండలాల్లోని 145 గ్రామాల్లో ప్రభుత్వం గతేడాది అక్టోబరులో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించింది. దీని లో భాగంగా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు సంబంధించి 148 పనులకు ఉపాధి నిధులు రూ.84.69కోట్లు మంజూరు చేసింది. నవంబరులో వివిధ గ్రామాల్లో వేసిన రోడ్లకు కూడా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదు. ఇప్పటివరకు రూ.17కోట్లు విలువ చేసే (మిగతా 8వ పేజీలో..)



నరసన్నపేట శివారులో నిర్మించిన సీసీ రోడ్డు (ఫైల్)

తేలనున్న తమ్మినేని 'డిగ్రీ' బాగోతం

- ఇప్పటికే ఉన్నతాధికారులకు పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- రంగంలోకి దిగనున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

శ్రీకాకుళం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మాజీ స్పీకర్, వైసీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ ఇన్‌చార్జి తమ్మినేని సీతారాం 'డిగ్రీ' బాగోతం వ్యవహారం త్వరలో తేలనుంది. దీనిపై విచారణ చేపట్టేందుకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ త్వరలో రంగంలోకి దిగనుంది. తెలంగాణ రాష్ట్రంలో మూడేళ్ల కాలపరిమితి గల 'లా' కోర్సులో తమ్మినేని అప్పట్లో ప్రవేశం పొందడం.. అందులో అప్పటికే డిగ్రీ అర్హత ఉన్నట్లుగా చూపించడం పెద్ద వివాదమైంది. తమ్మినేని డిగ్రీ ఉత్తీర్ణత నిజం కాదని.. సంబంధిత సర్టిఫికెట్ నకిలీది అని రాష్ట్రపతి కార్యాలయంతో అంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆయన మేనల్లుడు, ప్రస్తుత ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే దీనిపై ఫిర్యాదు చేయగా.. అప్పట్లో విచారణను జరగనీయకుండా జగన్ సర్కారు అడ్డుకుంది. నేరుగా రాష్ట్రపతి కార్యాలయం నుంచి గత ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డికి ఆదేశాలు వచ్చినా విచారణ మాత్రం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో 2024 కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో తమ్మినేని డిగ్రీపై ఈ ఏడాది జనవరిలో మరోమారు ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఫిర్యాదు చేశారు. గతంలో చేసిన ఫిర్యాదుల ప్రతులను సైతం జతచేశారు. తమ్మినేని నకిలీ డిగ్రీ పట్టాపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఇప్పటికే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించింది. ఇదిలా ఉండగా తమ్మినేని డిగ్రీ అడ్మిషన్, సర్టిఫికెట్ వివరాలు.. తెలంగాణ రాష్ట్రంలో మరొక పేరుతో ఉన్నాయని ఇప్పటికే వెల్లడైంది. త్వరలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగంలోకి దిగనుంది. దీంతో 'డిగ్రీ' బాగోతంలో స్పష్టత రానుంది.

ఆపదలో ఉన్నవారికి అండగా ప్రభుత్వం


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న వాండ్రంగి, పెంట గ్రామాలకు చెందిన డబ్బాడ సురేంద్ర, అలుగోలు వెంకట శ్రీనివాసరావుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు.కార్యక్రమంలో నాయకులు బూరాడ వెంకటరమణ, సాకేటి నాగరాజు, సనపల త్రినాథరావు, కంచరాన సూరన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కవులకు అధ్యయనం అత్యవసరం

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగంలో రాణించాలనుకునే కవులు, రచయితలు తప్పనిసరిగా అధ్యయనం చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. వేమన కవితామయం, తపస్వీ మనోహరం, సంయుక్తంగా నిర్వహించిన కవితా సంపుటల పురస్కారాల ప్రదానసభ కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. కవితల సంపుటిలో విజేతలకు బహుమతులు అందజేశారు. సభకు ఈ వేమన అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, బుర్రి కుమార్ రాజు, బలివాడ తేజస్విని ప్రసంగించారు.

నిత్యావసర సరుకులు అందజేత

కంచిలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీకి చెందిన రేనా బెహరాకి చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. నిరుపేద కుటుంబం కావడంతో సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్ఐ పి.పారినాయిడు, టీడీపీ నాయకులతో కలిసి దుస్తులు, బియ్యం, కూరగాయలు, కిరాణా సామగ్రి ఆదివారం అందజేశారు. టీడీపీ నాయకులు జగదీష్ పట్నాయక్ రూ.5వేలు, బంగారు కురయ్య, కొర్రాయి కురయ్య రూ.వెయ్యి చొప్పున్న అందజేశారు.

తెలగ కులస్థులను బీసీలో చేర్చాలి

పొందూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుక బడిన తెలుగ కులస్థులను రాష్ట్ర ప్రభుత్వం బీసీలోకి చేర్చాలని పొందూరు తెలుగకుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని తెలగకుల సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా పాయక రామారావు, అధ్యక్ష, కార్యదర్శులుగా జీఆర్ఎల్ భాస్కరరావు, పిట్ట నారాయణరావు, కోశాధికారిగా గంటా నారాయణరావు, ఉపాధ్యక్షులుగా మామిడి కృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యులుగా పశుపురెడ్డి శ్రీనివాసరావు, పిట్ట గోవిందరావు ఎన్నికయ్యారు.

చీటీ లేకుంటే మందులు ఇవ్వొద్దు

సోంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ రాసిన చీటీలేకుంటే మందులు ఇవ్వొద్దని మెడికల్ అసోషియేషన్ అధ్యక్షుడు వజ్జ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని మెడికల్ షాపుల్లో 'నో ప్రిస్క్రిప్షన్- నో మందులు' పేరుతో స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో కార్యదర్శి సురేష్, పాలిశెట్టి రవి, ప్రభాకర్ ఉన్నారు.

రాత్రి, పగలు వెలుగుతున్న లైట్లు



సరుబుజ్జిలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రొట్టవలస గ్రామంలో వీధిలైట్లు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. స్థానిక పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు ఆదివారం మధ్యాహ్నం లైట్లు వెలుగుతూ కనిపించాయి. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రకటనలు చేస్తున్నా.. ఇక్కడ మాత్రం అదేమీ పట్టడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, సిబ్బంది స్పందించి వీధిలైట్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల విజ్ఞానయాత్ర



గార, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అంపోలు పంచాయతీ ఆడవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం విజ్ఞాన యాత్రకు వెళ్లారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని డిగ్రీ కళాశాల, లయన్స్ క్లబ్, జామియా మసీదు, చర్చి, జిల్లా కేంద్ర గ్రంథాలయం, గాంధీపార్క్, గాంధీ మందిరం, రిమ్స్ ఆసుపత్రి, అరసవల్లి ఆలయం మొదలైన చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను హెచ్ఎం, ఉపాధ్యాయులు చూపించారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ల కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ హెడ్ కాన్స్టేబుళ్ల కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. ఈ ఎన్నికలకు అబ్జర్వర్లుగా శ్రీకాకుళం సీఐ ఎంవీ గోపాలకృష్ణ, నరసన్నపేట సీఐ ఎస్వీ రమణమూర్తి వ్యవహరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు 10మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా అడ్వైజర్ నియామకం

గుజరాతీపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదికకు సంబంధించి జిల్లా కమిటీ సలహాదారుడిగా తమ్మినేని చందనరావును నియమించారు. జిల్లాలోని సంతబొమ్మాళి మండలం ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులుగా ఆయనకు జాతీయ కన్వీనర్ నుంచి నియామక పత్రం అందాయి. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఈ పత్రాన్ని అందజేశారు.

సొండికుల సంక్షేమ సంఘం కార్యవర్గం

అరసవల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కత్తెరవీధిలో గల కెమిస్టు భవనంలో శ్రీకాకుళం సొండి కుల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా నల్లాన మధు ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా నల్లాన నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా రత్నాల జగన్మోహనరావు, కోశాధికారిగా షావుకారి గోపాలరావు, సహ కోశాధికారిగా పాండవ వెంకటరమణమూర్తి(బాబ్జీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 2028 వరకు ఉంటుంది.

నిబంధనలు పట్టవా?



ఆమదాలవలస, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఇసుక లారీల డ్రైవర్లు నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇసుకపై టార్పలిన్లు కప్పకుండానే వెళ్తుండడంతో వెనుక వస్తున్న వాహనదారులపైకి ఇసుక ఎగిరిపడడంతో ఇబ్బందిపడుతున్నారు. ఇటువంటి వాహనాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అసోసియేషన్ అధ్యక్షుడు, ఆమదావలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు అధ్యక్షతన ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో 13 జిల్లాల సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే గణనీయమైన ఆదరణ కలిగి, అత్యద్భుతమైన ఫలితాలు, ప్రగతి సాధిస్తున్న సాఫ్ట్‌బాల్ గేమ్‌ను మున్ముందు మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 13 జిల్లాలకు సాఫ్ట్‌బాల్ స్పోర్ట్స్ కిట్లు, క్రీడా దుస్తులు సమకూర్చేందుకు తగిన ఎస్టిమేట్లు సిద్ధం చేయాలన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాల కల్పనపై త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మూడేళ్లలో శ్రీకాకుళంలో నేషనల్ పోటీలు నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలు తెలియజేయాలని సంఘ ప్రతినిధులు ఎంవీ రమణకు సూచించారు. సమావేశంలో జిల్లా చైర్మన్ బి.హరధరరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో పి.సుందరరావు, పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, గ్రిగ్స్ కార్యదర్శి కె.మాధవరావు, కె.నరసింహారెడ్డి, ఎస్.నూరిబాబు, 13 జిల్లాల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం



నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అరసవల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధులు, విప్లవ యువకిశోరాలు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక క్రాంతి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రవి, నాయకులు జి.వసంత్, బాలకృష్ణ, హరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు


స్వామివారి దర్శనానికి క్యూలో వేచిఉన్న భక్తులు

అరసవల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దర్శనానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. క్యూలైన్లలో భక్తులు పెద్ద ఎత్తున వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం సేదతీరేందుకు ఆలయం ఎదురుగా పెద్దపెద్ద చలువ పందిళ్లను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు పందిళ్లలో కూర్చుని ప్రసాదాలు స్వీకరించారు. ఉచిత అన్నప్రసాదం కౌంటర్ వద్ద భక్తులు పెద్ద ఎత్తున క్యూలైన్లలో బారులు తీరారు. ఇంద్ర పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి, రావిచెట్టుకు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.6,91,823 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.3,76,300, విరాళాల రూపంలో రూ.1,41,803, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,73,720 లభించాయి.

సందడిగా రాజమ్మ సంబరాలు


గార: సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

గార, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ చిన్నవత్సవలసలో రాజమ్మ సంబరాలు ఆదివారం వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు పవిత్ర సముద్ర స్నానాలు చేసి భూలోకమ్మ, రాజమ్మలను దర్శించుకున్నారు. శ్రీకూర్మంలో కూర్మనాథుని కూడా భక్తులు దర్శించి పూజలు చేశారు. సీఐలు కె.పైడపునాయుడు, బి.ప్రసాదరావు (మెరైన్), ఎస్ఐ ఆర్.జనార్దన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పైడితల్లి జాతర ప్రారంభం


పొందూరు: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పొందూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పొందూరు పైడితల్లి అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ జాతరకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచే భారీగా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఆదివారం సాయంత్రం అమ్మవారిని కలశాలతో పొందూరు పట్టణంలో ఊరేగించారు. అమ్మవారిని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపునకు తీసుకువచ్చారు. ఎస్ఐ వి.సత్యన్నారాయణ ఆధ్వర్యంలో 50 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ధనరాజ తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణ పలు వార్డుల ప్రజలతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు బిందెలతో తెచ్చిన పానకాలు,

వార్షికోత్సవం

సోంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నింబాసి ని అమ్మవారి వార్షికోత్సవం మూడురోజులపా టు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నప్రసాద వితర ణ చేపట్టారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు.

ముగిసిన నాటికలు


నాటికలోని ఓ సన్నివేశం


జబర్దస్త్ అప్పారావు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం బాపూజీ కళామందిర్‌లో తాడేపల్లి వారికి చెందిన గంగోత్రి సాయి దర్శకత్వంలో 'విడాకులు కావాలి' నాటిక ప్రదర్శించారు. అదేవిధంగా విశాఖ ఉక్కు నగరానికి చెందిన పి.బాలాజీ నాయక్ దర్శకత్వంలో 'అసత్యం' సాంఘిక నాటికలు ఆహుతలను ఆకట్టుకున్నాయి. నాటికలు అనంతరం సినీటీవి నటుడు జబర్దస్త్ అప్పారావు ఆధ్వర్యంలో హాస్యవల్లరి ప్రదర్శన ఆహుతలను కడుపుబ్బా నవ్వించింది. కార్యక్రమంలో ఇప్పిలి శంకర్ శర్మ, గుత్తా చిన్నారావు, పులఖండం శ్రీనివాసరావు, నక్క శంకరరావు, పార్థసారథి, వరలక్ష్మి, ఉషారాణి, పూజ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన ఇస్తున్నారని, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా కష్టపడాలని జిల్లా బేస్‌బాల్ సంఘం నూతన అధ్యక్షుడు గుంటముక్కల వీరభద్రరావు అన్నారు. స్థానిక జీటీ రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా బేస్‌బాల్ సంఘం సర్వసభ్య సమావేశంతోపాటు నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో పి.సుందరరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, వై.పోలినాయుడు, కె.కిరణ్‌కుమార్, బి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేస్‌బాల్‌లో రాణించిన క్రీడాకారులను సన్మానించారు.

నూతన కార్యవర్గం..

జిల్లాస్థాయి బేస్‌బాల్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికకు పరిశీలకులుగా విజయనగరం కార్యదర్శి సీహెచ్ రాజేష్ హాజరయ్యారు. గౌరవాధ్యక్షుడిగా కిల్లంశెట్టి అరుణ్‌కుమార్ గుప్తా, అధ్యక్షుడిగా జి.వీరభద్రరావు, కార్యదర్శిగా వాసుపల్లి రాంబాబు, కోశాధికారిగా చీకటి మూర్తి, సహాయ అధ్యక్షులుగా డి.రామంజనేయులు, ఎల్.రాంబాబు, శ్రీను, సహాయ కార్యదర్శిగా తోటాడ శ్రీను, అంధవరపు సంతోష్ కుమార్, ఇప్పిలి అరుణ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొండపల్లి రవికుమార్‌తోపాటు ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

46 కేంద్రాల్లో ఉల్లాస్ పరీక్ష


గార: నిజామాబాద్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గార, మార్చి 23(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లో నిరక్షరాస్యులైన వయోజన మహిళలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్ పరీక్ష ఆదివారం మండలంలో 46 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు 2,241 మందికి 2,002 మంది వయోజన మహి ళలు హాజరయ్యారు. మండల వెలుగు ఏపీఎం వి.సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్ష కేంద్రాలను కుమ్మరిపేట నిజామాబాద్‌లో డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటరమణ, ఏపీవో బాలచందర్ పరిశీలించారు.

- కంచిలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వెలుగు సంస్థ ఆధ్వర్యంలో 1136 మందికి ఉల్లాస్ పరీక్ష రాసినట్లు ఏపీఎం అప్పలనర్సమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీవో తిరుమలరావు, ఎంఈవో శివరాంప్రసాద్, చిట్టిబాబు పర్యవేక్షించారు.
- ఇచ్ఛాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం జరిగిన ఉల్లాస్ అర్హత పరీక్షకు 1,222 మంది హాజరయ్యారు. వీవోఏలు, సీసీలు, ఇన్విజిలేటర్లుగా ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు.

అంతరిస్తున్న కళలను ప్రోత్సహించాలి

పలాసరూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అంతరిస్తున్న గ్రామీణ కళలకు ప్రోత్సాహం అందించాలని, తద్వారా కళాకారులను ఆదుకునేందుకు అవకాశం కలుగుతుందని గిడుగు రామమూర్తి జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని ఈనెల 21 నుంచి ఆదివారం వరకు నిర్వహించిన అంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ప్రాచీన జానపద కళలు, గిరిజన సంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా చెక్కభజన, తప్పెటగుళ్ల కళాకారులు తమ ప్రదర్శ నలిచ్చారు.

మూలుగుతున్న నిధులు

- కమిటీ అనుమతులు లేకే..
- అభివృద్ధికి నోచుకోని పొందూరు సీహెచ్‌సీ
- ఈ నెలాఖరు నాటికి వినియోగించకుంటే వెనక్కే..


పొందూరు సీహెచ్‌సీ

పొందూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ) హెచ్‌డీఎఫ్ ఖాతాలో నిధులున్నా ఎటువంటి అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదు. ఆసుపత్రిలో అత్యంతకీలకమైన గైనిక్ విభాగానికి శస్త్ర చికిత్స థియేటర్‌కు యంత్ర పరికరాలు, మందులు కొనుగోలు, ల్యాబ్‌కు ఏసీలు, కంప్యూటర్లు కొ నుగోలు తోపాటు, బాత్‌రూమ్‌లు, టాయిలెట్ల మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది. ఆసుపత్రి అభివృద్ధికి రెండుళ్ల గా రూ.2.50 లక్షలు చొప్పున మంజూరై ప్రస్తుతం రూ.5 లక్షలు నిధులు ఉన్నాయి. ఈ నిధు లతో వినియోగిం చాలంటే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అనుమతి తప్పనిసరి. మార్చి నెలాఖరులోగా ఈ నిధులు వినియోగించ కపోతే వెనక్కి మళ్లిపోయే పరిస్థితి ఉంది. వాస్తవానికి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియమించారు. ఈ పరిస్థితుల్లో అవసరమైన పనులకు నిధులు వినియోగించాలని ఎదురుచూస్తున్నారు. గతంలోనూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అను మతులు లేకపోవడంతో హెచ్‌డీఎఫ్ నిధులు వెనుకకు వెళ్లిపోయాయి. దీంతో అప్పుడు అవసర మైన పరికరాలు, మందులు కొనుగోలు చేయలేక, ఆసుపత్రిలో మరమ్మతులు లేక అభివృద్ధి నిలిచిపోయింది. ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌లో ఉన్న నిధులు వినియోగానికి సమయం సమీపిస్తుండడం తో గతంలో పరిస్థితే ఈ ఏడాది వస్తుందేమో నని ఆందోళన వ్యక్తమవుతోంది. నిధులున్నా అభివృద్ధికి నోచుకోని పరిస్థితి.

కమిటీ దృష్టికి తీసుకువెళ్లాం

ప్రస్తుతం నిధులతో కొనుగోలు చే యాలని యంత్ర పరికరాలు, మందు లు, ఏసీలు, చే యాల్సిన మరమ్మతుల పై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దృష్టికి తీసుకు వెళ్లాం. ముఖ్యంగా గైనిక్ విభాగంలో కీలకమైన పరిక రాలు కొనుగోలుచేయాల్సి ఉంది.

- పి.సుజాత, ఆసుపత్రిసూపరింటెండెంట్

అభివృద్ధికి సహకరిస్తాం

హెచ్‌డీఎఫ్ నిధుల విషయం వైద్యులు తెలిపారు. కమిటీ అనుమతితో ఆసుపత్రికి అవసరమైన అభివృద్ధి పనులు నిర్వహించడంతో పాటు అవసరమైన యంత్ర పరికరాలు, మందుల కొనుగోలు, మరమ్మతుల నిర్వహణకు సహకరిస్తాం.

- కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్

దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రమీల ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి, ఇంటర్‌తో పాటు 7, 8, 9, 10వ తరగతులు, అలాగే ఇంటర్‌లో మిగులు సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లోనే దరఖా స్తులు చేసుకోవాలన్నారు.

- ఆమదాలవలస, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తాళ్లవలస వద్ద ఉన్న కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్ ప్ర థమ సంవత్సరం ఎంపీసీ కోర్సులో చేరేందుకు బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శిరీష ఆదివారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. వచ్చే నెల 11లోగా దరఖాస్తుచేసుకోవాలన్నారు.

దరఖాస్తుకు గడువు పెంపు

సరుబుజ్జిలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువు ఈ నెల 25 తేదీ వరకు పెంచినట్లు ఎంపీడీవో ఎం.పావని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుణాల దరఖాస్తుకు సంబంధించి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన తర్వాత ఆన్‌లైన్ ప్రింటెడ్ కాపీను మండల పరిషత్ కార్యాలయంలో అందించాలన్నారు.

95 మంది రక్తదానం

రణస్థలం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో 95 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు ఇడిదాసుల వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ.. రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా యువత ముందుకు రావాలన్నారు. సేకరించిన రక్తాన్ని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు తిరుపతిరాజు, వైద్యులు ఇడిదాసుల యశ్వంత్, జేఆర్ పురం సర్పంచ్ బవిరి రమణ, మండల వైస్ ఎంపీపీ రాయపరెడ్డి భజంగరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ వైభవానికి కృషి చేద్దాం

ఆమదాలవలస, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ పూర్వ వైభవానికి ఎటువంటి బేధాలు లేకుండా సమష్టి కృషి చేద్దామని నియోజకవర్గ పార్టీ చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ఆమదాలవలస మున్సిపాలిటీ వైసీపీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, నాయకులు సురవరపు నాగేశ్వరరావు, బద్రి రామారావు, దుంపల శ్యామలరావు ఖండాపు గోవిందరావు తదిరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి


కిరణ్‌కుమార్ (ఫైల్)

ఎచ్చెర్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్‌కు సమీపంలో పాత జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ ల్యాబ్ టెక్నీషియన్ మృతిచెందాడు. రణస్థలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న శ్రీకాకుళం నగరానికి చెందిన దేవరాజు వెంకట కిరణ్‌కుమార్ (40) ఎచ్చెర్లలోని నివాసం ఉంటు న్నారు. ఎచ్చెర్ల నుంచి ప్రతిరోజూ రణస్థలానికి రాకపోకలు సాగిస్తున్నారు. రోజు వలే ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో ఇంటి నుంచి రణస్థలం వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయలుదేరారు. రాజాం నుంచి వత్సవలస ప్రయాణికులతో వెళ్తున్న మ్యాజిక్ వ్యాన్.. కిరణ్ కుమార్ తన ద్విచక్ర వాహనంపై మలుపు తిరుగుతుండగా ఢీకొంది. ఈ ఘటనలో కిరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. గతంలో కిరణ్‌కుమార్ ఎచ్చెర్ల పీహెచ్‌సీలో పనిచేసి, సుమారు మూడేళ్ల కిందట రణస్థలం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు బదిలీ అయ్యారు. కిరణ్‌కు భార్య స్వప్నకుమారి, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి..

ఆమదాలవలస, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే అండర్ పాసేజ్ వంతెన వద్ద ఇసుక ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రైల్వే ఉద్యోగి జరజాన కృష్ణ(57) మృతి చెందినట్టు ఎస్ఐ బాలరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఇసుక లోడుతో ట్రాక్టర్ ఊసనివానిపేట రైల్వేగేట్ నుంచి బీఆర్ నగర్ వైపు వస్తుండగా ద్విచక్ర వాహనంపై కృష్ణ మెట్టక్కివలసలోని కుప్పిలివారి వీధిలో నివాసం ఉంటున్న తన స్వగృహానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళకు గాయాలు కాగా ఓ చిన్నారికి తీవ్ర గాయాలు కాగా జరజాన కృష్ణపై నుంచి ట్రాక్టర్ వెళ్లిపోవడంతో తీ వ్ర రక్తస్రావమై అక్కడే పడిపోవడంతో స్థానికులు హుటాహుటిన జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుడు కృష్ణ కామేశ్వరిపేటలో రైల్వేట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..

ఆమదాలవలస, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ పరిధి ఆమదాలవలస గేటు సమీపంలో ఆదివారం గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం రూరల్ మండలం నైర పచాయతీ చల్లపేట గ్రామానికి చెందిన కరిమెల్ల సూరిబాబు (55) ఆమదాలవలస గేటు ప్రాంతంలో వడ్రంగి దుకాణంలో పనిచేస్తున్నారు. ఆయనకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో అక్కడే ఉంటున్నాడు. ట్రాక్ దాటేందుకు వచ్చాడో, ఏం జరిగిందనే విషయం తెలియరాలేదన్నారు. కుటుంబ సభ్యుల కోసం సమాచారం సేకరిస్తున్నామని, మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించామన్నారు.

కెనాన్ డాగ్‌తో తనిఖీలు

పాతపట్నం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పాతపట్నం, కొరసవాడ, సీది గ్రామాల్లోని పలు దుకాణాల్లో ఆదివారం ఎస్ఐ బి.లావణ్య ఆధ్వర్యంలో కెనాన్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పునాదులు విరగ్గొట్టి భూమి కబ్జా చేశారు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


డాక్యుమెంట్లు చూపిస్తున్న హెచ్‌ఎం డొక్కరి జనార్దన

పలాస, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తాను కొనుగోలు చేసి పునాదులు వేసిన స్థలాన్ని కొందరు అది తమ స్థలమంటూ పునాదులు విరగ్గొట్టి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని మందస మండలం రాధాకృష్ణాపురం గ్రామానికి చెందిన హెచ్‌ఎం డొక్కరి జనార్దన కాశీబుగ్గ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఉద్యోగ రీత్యా తాను పలాస పురుషోత్తపురం కాలనీలో నివాసం ఉంటు న్న తాను సర్వే నెంబర్ 52/1లో 12 అడుగులు 2013లో దుంపల శర్వాణి, దాని పక్క నే కొండ కమలమ్మ వద్ద 9 అడుగులు, శిమ్మ కృష్ణచంద్ర వద్ద 21 అడుగులు, మొత్తం 42 అడుగుల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించానన్నారు. స్థలం పరిరక్షణకు పునాదులు కూడా వేశానని, రిటైర్డ్ అయిన తరువాత ఇల్లు నిర్మించేందుకు యోచించానన్నారు. ఈనెల 18న కాశీబుగ్గ లేబర్‌కాలనీ, పెద్ద రాజాం, పెదంచల, కాశీబుగ్గలకు చెందిన నలుగురు వ్యక్తులు సదరు పునాదులను ధ్వంసం చేశారని, తాను రెండు రోజుల కిందట స్థలపరిశీలనకు వెళ్లే సరికి పునాదులు లేవని, పెద్ద గోతులు తవ్వి ఆస్తిని కబ్జా చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఆస్తిని తాము కొనుగోలు చేశామని వారు భయపెడుతున్నారన్నారు. దస్తావేజులు చూపిం చినా బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆన ఆస్తిని కబ్జాచేయడమే కాకుండా తిరిగి తనపైనే కేసు నమోదు చేయించారన్నారు. దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఈ విషయమై కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా బాధితుడి ఫిర్యాదు మేరకు పలాస తహసీల్దార్‌కు వివరణ కోసం లేఖ రాశామన్నారు. సంబంధిత స్థలం ఎవరి పేరుమీద ఉన్నాయన్న విషయాలను పరిశీలించి నివేదిక కోరామన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం/ఎల్.ఎన్ పేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎల్ఎన్‌పేట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన కరగాన వెంకటరావు లివర్, కిడ్నీకి సం బంధించిన సమస్యలతో బాధపడుతుండగా ఉన్నత వైద్య కోసం సీఎంఆర్ ఎఫ్ నుంచి మంజూరైన రూ.1,07,452 చెక్కును ఆదివారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

ఎంజీఆర్ నియామకంపై హర్షం

కొత్తూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ప్రివిలైజ్ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నియామకంపై పలువురు టీడీపీ నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు కొత్తూరుకు చెందిన వలురౌతు సుధాకరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పడాల లక్ష్మణరావు, గోగుల వరప్రసాదరావు, నూలు వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహానుభావులను స్మరించుకోవాలి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహానుభావులను నిత్యం స్మరించుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో దాతలు ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్, స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్, అబుల్‌కలాం ఆజాద్ విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, డీఈవో తిరుమల చైతన్య, జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, ఎంఈవోలు బమ్మిడి మాధవరావు, ప్రసాదరావు, హెచ్‌ఎం మెండ రామారావు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పేదల గూడుకు ప్రభుత్వ సాయం

● అసంపూర్తి ఇళ్లకు అదనపు నిధులు
● జిల్లాలో 7414 మందికి లబ్ధి


పేదలకు అనువుగాని చోట కేటాయించిన స్థలం (ఇన్‌సెట్) మధ్యలో నిలిచిన ఇంటి నిర్మాణం

హిరమండలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి మధ్యలో నిధుల కొరతతో వదిలేసిన వాటిని పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం అదనపు నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయ డం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాలో 7,414 మంది లబ్ధిదారులకు ప్రయో జనం చేకూరనుంది. వివరాలిలా ఉన్నాయి.. వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో పేదల ఇళ్ల నిర్మాణాలు అసం పూరిగా నిలిచిపోయాయి. కేంద్రప్రభుత్వం యూనిట్‌కు ఇచ్చే రూ.1.80 లక్షలు కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వకుండానే ఆ స్కీమ్ అంతా తనదేనన్నట్లు ప్రచారం చేసుకుంది. ఈ నిధులు ఇంటి నిర్మాణానికి చాలక పోవడంతో పనులు ప్రారంభించినప్పటికీ వివిధ దశల్లో నిలిచిపోయాయి. దీంతో ఆ ఇళ్లలో ఉండలేక, పనులు పూర్తి చేయలేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఈ ఇళ్లన్నీ దిష్టి బొమ్మల్లా కనిపిస్తున్నాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం 2019-2024 మధ్య పక్కా ఇళ్ల ప్రారంభించి ఆర్థిక ఇబ్బందులతో నిలిపి వేసిన ఇళ్లకు అదనపు మొత్తం కేటాయించి ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఇందులో భాగంగా పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక ఆర్థిక సాయం అందించడం ద్వారా ఈ ఇళ్లను ఏప్రిల్ 20వ తేదీ లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. అర్ధాంతరంగా నిలిచిన ఇళ్లలో 90 శాతం వెనుకబడిన వర్గాలకు చెందిన వారివే. వీరికి వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నగదుకు అదనంగా రూ.50 వేల నుంచి రూ.75 వేలవరకు అదనంగా ఇచ్చేందుకు నిర్ణయించింది.

జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో 7,414 ఇళ్లకు ఈ అదనపు నిధులను కేటాయించారు. ఎస్సీలకు చెందిన 681, ఎస్టీలు 287, ఆది వాసీ గిరిజనులు 128, చేనేత కార్మికులు 6,007, ఇతరులకు చెందిన 311 ఇళ్లకు నిధులు మంజూరయ్యాయి. గృహ నిర్మాణంలో పురో గతి ఆధారంగా నాలుగు విడతలుగా నగదు వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తారు. ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన అదనపు సాయం పొందాలంటే ఏప్రిల్ 20 లోగా నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పేదలు వినియోగించుకోవాలి

నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీల పక్కా గృహాలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అదనపు సాయం అందిస్తోంది. నిర్మాణంలో పురోగతి ఆధారంగా సాయం మంజూరు చేస్తారు. ఈ సాయాన్ని వినియోగించుకుని ఇళ్లను పూర్తి చేసుకోవాలి.

-వి.నర్సింగరావు, డీఈఈ, హిరమండలం

పలాస అభివృద్ధి కావాలంటే ఎయిర్‌పోర్టుకు సహకరించండి

● ఎమ్మెల్యే గౌతు శిరీష


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పలాస అభివృద్ధి కావాలంటే ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎక్కువగా వలసలు వెళ్లిపోతున్నారని, ఇక్కడే ఎయిర్ పోర్టు ఉంటే ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఎయిర్‌పోర్టు కావాలని జిల్లాలో అనేక మంది ఎమ్మెల్యేలు కోరుతున్నారని, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పలాస అభివృద్ధిని కాంక్షించి ఇక్కడే ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. అభివృద్ధి చేద్దామంటే కొందరు విష ప్రచారం చేస్తున్నారని, అయితే ఆ నాయకులు గత ప్రభుత్వ హయాంలో కొండలు దోచుకున్నా ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీ కృష్ణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్ రావు, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, నేతలు గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్, కార్యదర్శి టంకాల రవి శంకర్‌గుప్తా, కోట్ని దుర్గా ప్రసాద్, దువ్వాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించండి

పలాసరూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యాసంవత్సరంలో ప్రతి పంచాయతీలో మోడల్ పాఠశాల ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస టీడీపీ కార్యాలయంలో వజ్రపుకొత్తూరు, పలాస మండలాల ఎంఈవోలు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాస రావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిపై తెగుళ్ల పంజా

(ఐదో పేజీ తరువాయి)

ఈనెలు మాత్రమే కనిపిస్తుంటాయి. ఈ తెగులు సోకితే పంట దిగుబడి తగ్గిపోతుంది. 1988-89లో కవిటి మండలంలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం గ్రామాల్లోని తోటలకు నల్లముట్టి తెగులు సోకి చెట్లను నాశనం చేసింది. ఆ తర్వాత ఉద్దానం మొత్తం వ్యాపించడంతో రైతులు కొంతమేర నష్టపోయారు. తర్వాత వర్షాలు అధికంగా కురవడంతో దశల వారీగా దాని ఉధృతి తగ్గింది. ప్రస్తుతం కంచిలి మండలంలోని శ్రీరాంపురం, మఖరాంపురం, కొజ్జిరియా, సాలినపుట్టుగ తదితర గ్రామాల్లోని కొబ్బరితోటలకు నల్లమట్టి తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాండం తొలుచు పురుగు..

కొబ్బరి రైతులను భయపెడుతున్న మరో తెగులు కాండం తొలుచు పురుగు. చెట్టు కాండాన్ని తొలచి తియ్యని పదార్థాన్ని తినివేసే కొమ్ము, ఎర్రముక్కు పురుగుల ఉధృతి ప్రస్తుతం అధికంగా ఉంది. మొక్క పెరిగే దశలోనే కాండంపై నుంచి ఆశించి లోపలి భాగాన్ని తినివేస్తాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ పురుగుల నివారణ సాధ్యం కావడం లేదని రైతులు చెబుతున్నారు. కొబ్బరి మొక్క నాటి న నుంచి పదేళ్లు దాటితే కానీ పంట దిగుబడి రాదు. అయితే, ఈ ప్రాంత ఇసుక నేలలు కావడంతో ఈ పురుగులు ఇసుక లోనే గోతులు చేసుకొని ఉంటున్నాయి. ఒక మొక్క నుంచి మరోక మొక్కకు ఆశించి నాశనం చేస్తున్నాయి. దీంతో మొక్కల సంరక్షణ భారంగా మారిందని రైతులు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి..

కొబ్బరి పంటే మాకు ప్రధాన ఆదాయ వనరు. ప్రస్తుతం ఉద్దానం లో కొబ్బరి పంటకు వివిధ తెగుళ్లు ఆశించాయి. దీనివల్ల రైతులు నష్టపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కొబ్బరి పంట కనుమరు గయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలి.

-ఎ.త్రివిక్రమరావు, కొబ్బరి రైతు, కవిటి

సామూహిక సస్యరక్షణ చేపట్టాలి..

కొబ్బరి తోటల్లో తెగుళ్ల నివారణకు రైతులు సామూహిక సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. తెల్లదోమ నివారణకు పసుపు అట్టలను చెట్లకు కట్టాలి. వేప నూనె పిచికారీ చేయాలి. రసాయన మందులు మాత్రం పిచికారీ చేయ కూడదు. కాండం తొలుచు పురుగు ఆశిస్తే.. చెట్టు మొదలులో ఏర్పడిన రంధ్రం ద్వారా సన్నని ఇనుప సూదిని గుచ్చి పురుగును చంపాలి. ఆ తర్వా త సెవిడాల్ 8జీ అనే మందు పొడిని ఇసుకలో కలిపి రంధ్రాలను కప్పివేయాలి.

-పి.మాధవీలత, ఉద్యానవనశాఖాధికారి, కవిటి

సిక్కోలు ఉద్యమాలకు దిక్సూచి 'అప్పలసూరి'

● సినీనటుడు నారాయణమూర్తి

నరసన్నపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పోరాటాల పురిటిగడ్డ సిక్కోలు అని.. ఇక్కడి నుంచి పేదల పక్షాన విప్లవ బాటపట్టి దిక్సూచిగా నిలిచిన వ్యక్తి మామిడి అప్పలసూరి అని పీపుల్స్‌స్టార్, సినీ నటుడు ఆర్.నారా యణ మూర్తి అన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు రచించిన 'మండేటి సూరీడు' మామిడి అప్పలసూరి జీవితచరిత్ర పుస్తకాన్ని ఆదివారం కోమర్తిలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద నారాయణ మూర్తి ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాడిత, పీడిత, గిరిజనుల పక్షాన నిలిచి సిక్కోలు గడ్డ నుంచి పోరాటాలు చేసిన ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యం, కోరన్న, మంగన్న వంటి వారు పెద్ద గురువుగా అప్పలసూరిని పిలుచుకునేవారన్నారు. ఆయన చరిత్రను పుస్తక రూపంలో తీసుకురా వడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, సీపీఐఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు దంతలూరి వర్మ, తామాడ సన్యాసిరావు, ప్రజా కళామండలి రాష్ట్ర నాయకుడు కొర్రాయి నీలకంఠం, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భవిరి కృష్ణమూర్తి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, గంటేడ గౌరునాయుడు, వాన కృష్ణచంద్, మామిడి క్రాంతి, రవి తదితరులు పాల్గొన్నారు.


అప్పలసూరి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీనటుడు ఆర్.నారాయణమూర్తి

కొత్తమ్మతల్లి ఆలయ అభివృద్ధికి కృషి: మంత్రి అచ్చెన్నాయుడు


మంత్రి అచ్చెన్నకు జ్ఞాపిక అందిస్తున్న ఈవో

కోటబొమ్మాళి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గ ఆలయానికి దీటుగా స్థానిక కొత్తమ్మతల్లి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి కొత్తమ్మతల్లిని కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మేనేజర్ వి.రాధాకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. పురోహితులు గణపతి శర్మ పూజలు చేశారు. ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నేతలు బోయిన రమేష్, బోయిన గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన సంఘం 71వ వార్షికోత్సవం

పలాసరూరల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక పతాకాన్ని ఎగురవేసి యువజన సంఘం ఉద్దేశాలను వివరించారు. అనంతరం స్వాతంత్ర్యపోరాటంలో అమరులైన భగత్‌సింగ్, సుఖ దేవ్, రాజగురు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. యువజన అధ్యక్షుడు గణేష్, ఏఐకేఎం సభ్యుడు మద్దిల రామారావు, మద్దిల నారాయణ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు తొలగేవరకూ ఉద్యమాలు


పలాస రూరల్: జోహార్ అర్పిస్తున్న దృశ్యం

పలాసరూరల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): అసమానతలు ఉన్నంత వరకు ఉద్యమాలు జరుగుతూనే ఉంటాయని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్రనాయకుడు వై.వెంకటేశ్వర్లు అన్నారు. మాకన్నపల్లిలో ఆదివారం స్వాతంత్ర్య ఉద్యమకారుడు భగత్ సింగ్ 94వ వర్ధంతిని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కాగర్ పేరుతో ఉద్యమకారులను తీవ్రంగా హింసిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు పత్రి దానేసు, పీడీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, పీడీఎం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, చింతాడ కృష్ణారావు, తెప్పల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయసాధనకు పాటుపడాలి


నరసన్నపేటలో...

నరసన్నపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, నెయ్యల సాంబశివరాజు అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్యామ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి


పాతపట్నంలో..

పాతపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, హరిశివరాం రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆదర్శనీయులని వక్తలు అన్నారు. ఆలాంధ్ర రోడ్‌లో ప్రాథమిక పాఠశాల ఆవరణలోని వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పి.రామరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'లోకబాంధవ శతకం' ఆవిష్కరణ

టెక్కలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అష్టావధాని, విద్వాన్ పైడి హరినాథరావు రచించిన లోకబాంధవ శతకం పుస్తకాన్ని సమాఖ్య ప్రతినిధులు డాక్టర్ జనార్దనరావు, గుజ్జు వెంకట రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. సాహిత్య సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సనపల నారాయణ మూర్తి మాట్లాడుతూ.. సామాజిక స్పృహతో అందరికీ అర్థమయ్యే రీతిలో రచనలు చేశారన్నారు. రోణంకి రామచంద్రరావు మాట్లాడుతూ.. శతకంలోని భావాలు సమాజ హితానికి మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో హనుమంతు నాగేశ్వరరావు, బొడ్డ అయ్యబాబు, చిలుకు కృష్ణారావు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

హరిపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వీజీపురం కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఆర్.వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ తరగతుల్లో ప్రవేశాలతో పాటు 7, 8, 9, 10 తరగతుల్లో మిగులు సీట్లను భర్తీ చేయనున్నామన్నారు. ఆసక్తి ఉన్న బాలికలు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మాదిగ ఉపకులాలకు న్యాయం

కాశీబుగ్గ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉప కులాలకు న్యాయం జరిగిందని ఆ సంఘం నేతలు అప్పలరాజు, సింహాచలం అన్నారు. ఆదివారం కాశీబుగ్గ ఎస్సీ వీధిలోని అంబేడ్కర్, జ్యోతీరావుపూలే, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు చేసిన పోరాటంలో ఎందరో అమరులయ్యారని, ఆ పోరాట ఫలితం నేటికి సాకారమవుతోందన్నారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణారావు, నేతాజీ, శివకుమార్, చంద్రయ్య, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

హిరమండలం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలకు అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సీఐ చింతాడ ప్రసాద్ అన్నారు. ఆదివారం హిరమండ లంలో సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. హిరమండలం, కొత్తూరు ఎస్ఐలు ఎండీ యాసిన్, ఆమీర్‌ఆలీ ఉన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

కొత్తూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చింతాడ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. క్రికెట్ మ్యాచ్‌లను యువత ఆనందంగా తిలకించాలే తప్ప పందాలు కాసి బెట్టింగ్‌లకు పాల్పడితే తీవ్రంగా నష్టపోతారన్నారు. గ్రామాల్లో గట్టి నిఘా ఉంచినట్లు చెప్పారు.

బాధ్యులను శిక్షించాలి

టెక్కలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో ట్రాన్స్‌జెండర్ దీపు హత్య అమానుషమని ట్రాన్స్‌జెండర్ల సంఘం అధ్యక్షులు బి.హరనాథ్ అన్నారు. హత్యకు వ్యతిరేకంగా ఆదివారం ఇందిరాగాంధీ కూడలిలో నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సోను తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు చెల్లిస్తారో?

(ఐదో పేజీ తరువాయి)

పనులు పూర్తికాగా, కేవలం రూ.3కోట్లు మాత్రమే చెల్లించారు. మరో రూ.14 కోట్లు చెల్లించాల్సి ఉంది. అలాగే, పాడిరైతులకు 47 గోకులాల షెడ్లు మంజూరు కాగా, కొందరు రైతులు పెట్టుబడులు పెట్టి పనులు పూర్తి చేశారు. వారికి కూడా ఇంత వరకు బిల్లులు అందలేదు. దీంతో పనులు చేసిన వారు తీవ్ర నైరాశ్యంలో కూరుపోయారు. తాము పనులు చేసిన వెంటనే క్వాలిటీ అధికారుల బృందం కూడా వచ్చి తనిఖీలు చేసిందని, అయినా బిల్లులు రాలేదని ఆవేదన చెందుతున్నారు. ప్రతి శుక్రవారం బిల్లులు జమ అవుతాయని చెప్పారని, కానీ నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడం దారుణం అంటున్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు, పాడి రైతులు కోరుతున్నారు.

వ్యాపారవేత్తలుగా తయారవ్వాలి

వజ్రపుకొత్తూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపారవేత్తలుగా తయారు కావాలని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. జీడి పంట ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సోంపేట ఏరియా కోఆర్డినేటర్ రామ్‌మోహన్, ఏపీఎం జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

వజ్రపుకొత్తూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పల్లిసారథి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ టీడీపీ అధ్యక్షుడుతామాడ విశ్వనాథం కోరారు. తితలీ తుఫాన్ తరువాత విద్యుత్‌స్తంభాలు, వైర్లు సరిగా చేయకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు దృష్టికి అనేక సార్లు సమస్యను తీసుకు వెళ్లినా ఫలితం లేదన్నారు. మేలో గ్రామ దేవత ఉత్సవాలున్నందున అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.